నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, సోమవారం 22 ఏప్రిల్ 2024 | BHADRADRI KOTHAGUDEM

## స్ట్రాంగ్ రూంలకు ఈవీఎం యంత్రాలు

**ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్**



స్ట్రాంగ్ రూంలకు ఈవీఎం యంత్రాలను పంపిస్తున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం, ఏప్రిల్ 21: అసెంబ్లీ సెగ్మెంట్లలోని స్ట్రాంగ్ రూములకు ఈవీఎం యంత్రాలను తరలిస్తున్నట్లు ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లపై ఐడీవోసీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం సహాయ రిటర్నింగ్ అధికారులతో సమీక్షించారు. గోదాములోని ఈవీఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అసెంబ్లీ సెగ్మెంట్ల సహాయ రిటర్నింగ్ అధికారుల ద్వారా స్ట్రాంగ్ రూములకు తరలించినట్లు చెప్పారు. ఖమ్మం, పాలేరు అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో; వైరా అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి వైరాలోని బాలికల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాలలో; మధిర సెగ్మెంట్‌కు సంబంధించి మధిరలోని పాలిటెక్నిక్ కళాశాలలో; సత్తుపల్లి సెగ్మెంట్‌కు సంబంధించి సత్తుపల్లిలోని జ్యోతి నిలయం హైస్కూల్‌లో స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్‌కు 440 బ్యాలెట్ యూనిట్లు, 440 కంట్రోల్ యూనిట్లు, 497 వీవీ ప్యాట్లు; పాలేరు అసెంబ్లీ సెగ్మెంట్‌కు 359 బ్యాలెట్ యూనిట్లు, 359 కంట్రోల్ యూనిట్లు, 406 వీవీ ప్యాట్లు; వైరా అసెంబ్లీ సెగ్మెంట్‌కు 312 బ్యాలెట్ యూనిట్లు, 312 కంట్రోల్ యూనిట్లు, 352 వీవీ ప్యాట్లు; మధిర అసెంబ్లీ సెగ్మెంట్‌కు 332 బ్యాలెట్ యూనిట్లు, 332 కంట్రోల్ యూనిట్లు, 375 వీవీ ప్యాట్లు; సత్తుపల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌కు 364 బ్యాలెట్ యూనిట్లు, 364 కంట్రోల్ యూనిట్లు, 411 వీవీ ప్యాట్లు తరలించి భద్రపర్చనున్నట్లు చెప్పారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల ఏర్పాట్లను నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయాలన్నారు. ఓటరు స్లిప్పులను ఈ 25 నుంచి ఇంటింటికీ పంపిణీ చేయాలన్నారు. ఓటర్ హెల్ప్ లైన్, సి–విజిల్‌పై ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. స్ట్రాంగ్ రూములను తెరిచేటప్పుడు, మూసివేసేటప్పుడు అభ్యర్థులు ఉండాలని చెప్పారు. ఇందుకోసం వారికి ముందుగానే సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, మిర్నల్ శ్రేష్ఠ, డీఆర్వో ఎం.రాజేశ్వరి, ఆర్డీవోలు గణేష్, రాజేందర్, తహసీల్దార్లు, పార్టీల ప్రతినిధులు స్వర్ణ సుబ్బారావు (ఆప్), వి.రాజేష్ (బీజేపీ), జి.పున్నయ్య (సీపీఎం), ఎన్.సత్యంబాబు (కాంగ్రెస్), చీకటి రాంబాబు (బీఆర్ఎస్), పాలడుగు కృష్ణప్రసాద్ (టీడీపీ) పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూంలో అధికారులకు సూచనలిస్తున్న ఖమ్మం కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, చిత్రంలో బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

## హత్యా రాజకీయాలకు బీఆర్ఎస్ దూరం

- ఖమ్మం జిల్లా చరిత్రలో సుపారీ హత్యల సంస్కృతి లేదు
- బీఆర్ఎస్ అలా చేస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేదా?
- ప్రజలను పక్కదోవ పట్టించడానికే తప్పుడు కథనాలు
- హామీలను నెరవేర్చని కాంగ్రెస్
- ముగ్గురు మంత్రులు ఉన్నా అభ్యర్థిని ఇంకా ప్రకటించలేదు
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ, ఎంపీ నామా, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ఖమ్మం, ఏప్రిల్ 21 : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై హత్యాయత్నం చేయడానికి తాను ప్రయత్నం చేశానని, దానికోసం సుపారి ఇచ్చానని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తీవ్రం ఖండించారు. ఆదివారం ఖమ్మం నగరంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు ఈ విషయంలో ఎలాంటి విచారణనైనా చేసుకోవచ్చని అన్నారు. తప్పుడు కథనాలను పత్రికల్లో రాయిస్తూ, యూట్యూబ్ చానల్స్‌లో ప్రసారం చేస్తూ బీఆర్ఎస్ నాయకుల ప్రతిష్ఠకు భంగం కలిగించాలనుకోవడం దుర్మార్గపు చర్య అని అన్నారు. హత్యా రాజకీయాలను బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిఉంటే ఈరోజున కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు మంత్రులుగా ఉన్న నాయకులు గతంలో బీఆర్ఎస్‌లో కూడా మంత్రులుగా, ఎంపీగా ఉన్నవారే కనుక వారు బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు హత్యా రాజకీయాలు ఉండేవా అన్నారు. అమలుకానీ హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు వాటిని అమలు చేయకుండా ప్రజలను తప్పుదోవ పట్టించడానికే ఇలాంటి కథలను అల్లుతున్నారని అన్నారు. ఖమ్మంజిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేశామే తప్ప ఇటువంటి చర్యలకు ఎప్పుడు పాల్పడలేదన్నారు. నాలుగు నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, పార్లమెంట్ ఎన్నికల్లో నామాకు అనుకూలంగా సర్వేలు వస్తున్నాయని తెలిపారు.

### హామీలు అమలుచేసేంత వరకూ వెంటాడి.. వేటాడుతాం: ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇచ్చిన హామీలను అమలుచేసేంత వరకూ ప్రభుత్వాన్ని వెంటాడి, వేటాడతామని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడతామని, పార్టీ కార్యకర్తలకు అన్నివిధాలా అండగా ఉండి, మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ హత్య, దాడుల సంస్కృతిని ఖండించారు.

### నెత్తురు కారకుండా రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ –రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర



బీఆర్ఎస్ కార్యకర్త శ్రీనునాయక్‌ను కాంగ్రెస్ గుండాలు హత్య చేయడాన్ని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తీవ్రంగా ఖండించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై భౌతికదాడులు జరుగుతున్నాయని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. మహానేత కేసీఆర్ నెత్తురు చిందకుండా తెలంగాణ మహోద్యమాన్ని శాంతియుత పద్ధతుల్లో నడిపించి రాష్ట్రాన్ని సాధించి ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చారని వివరించారు. హింసకు, హత్యా రాజకీయాలకు తమ పార్టీ బీఆర్ఎస్, అధినేత కేసీఆర్ పూర్తి వ్యతిరేకమని స్పష్టం చేశారు. నామా విజయం ఎప్పుడో ఖాయమైందని, భారీ మెజార్టీయే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎంపీ వద్దిరాజు చెప్పారు.

### తప్పుడు కేసులు పెడుతున్న కాంగ్రెస్ – ఎమ్మెల్సీ తాతా మధు



అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ కార్యకర్తలను చంపుతూ, తప్పుడు కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. నారాయణఖేడ్ జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తను దారుణంగా హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పండితాపురం, పాలేరు లాంటి చోట్ల తప్పుడు కేసులు పెట్టి బీఆర్ఎస్ నాయకులను జైళ్లకు పంపుతున్నారని మండిపడ్డారు. నామా మొదటి విడత ప్రచారం ముగిసిందని, 6 నియోజకవర్గాల్లో ప్రచారం పూర్తికాగా రెండో విడత ప్రచారం 25వ తేదీ ప్రారంభమవుతుందన్నారు. ప్రజల నుంచి నామాకు సంపూర్ణ మద్దతు లభిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలం అయ్యారన్నారు. బీసీకి చెందిన డీసీసీబీ చైర్మన్‌ను పదవి నుంచి తొలగించారని అన్నారు. మాజీమంత్రి పువ్వాడపై చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో పగడాల నాగరాజు, డోకుపర్తి సుబ్బారవు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా రామయ్యకు ఊంజల్ సేవ



భద్రగిరి ఆలయంలో స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఏప్రిల్ 21: భద్రాచలం సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వసంత పక్ష ప్రయుక్త శ్రీరామ నవమి తిరు కల్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ప్రాకార మండపంలో ఉత్సవ పెరుమాళ్లకు అర్చకులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం యాగశాలలో ఆస్థాన స్థానాచార్యులు కేఈ స్థలశాయి నేతృత్వంలో ఆచార్య, బ్రహ్మ ఋత్వికులు చతుః స్థానార్చాన జరిపారు. సాయంత్రం 6 గంటలకు బేడా మండపంలో బంగారపు ఊయలలో స్వామిని ఉంచి విశ్వక్సేన ఆరాధన, కర్మణః పుణ్యాహవాహన జరిపి, ఊయలను శేష పాన్పుగా భావించి ఆదిశేషున్ని, అష్టదిక్పాలకులను ఆవాహన చేశారు. అనంతరం ఊయల చుట్టూ చక్ర పొంగలిని బలిహరణంగా సమర్పించారు.

## నాలుగునెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం సంక్షోభంలో కూరుకుపోయింది

- జరిగిన పొరపాటును కొద్దిరోజుల్లోనే ప్రజలు గుర్తించారు
- సంక్షేమ పథకాలను కొనసాగించే పరిస్థితి లేదు
- పదేళ్ల తర్వాత మళ్లీ మొదలైన సాగు, తాగునీటి కష్టాలు
- బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

కారేపల్లి, ఏప్రిల్ 21 : నాలుగు నెలల కాంగెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం సంక్షోభంలో కూరుకుపోయిందని బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండల కేంద్రంలోని వైఎస్ఎన్ గార్డెన్‌లో ఆదివారం మాజీ ఎమ్మెల్యే, వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి బానోత్ మదన్‌లాల్ అధ్యక్షతన పార్టీ మండల ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధ్యంకాని హామీలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు వంటి పథకాలను కొనసాగించే పరిస్థితి కనబడడం లేదన్నారు. పదేళ్ల తర్వాత మళ్లీ తెలంగాణ రాష్ట్రంలో సాగు, తాగు కష్టాలను చూస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసమే తపించేవారన్నారు. తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనుడు మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జరగిన పొరపాటును ప్రజలు కొద్దిరోజులకే తెలుసుకున్నారని పేర్కొన్నారు. మళ్లీ కేసీఆర్ పాలనను రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణకు పూర్వవైభవం రావాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. వచ్చే నెలలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావును భారీ మెజార్టీతో గెలిపించుకొని కేసీఆర్‌కు కానుకగా ఇద్దామన్నారు. సమావేశంలో జడ్పీటీసీ వాంకుడోత్ జగన్, బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్ శ్రీనివాసరావు, ఉన్నం వీరేందర్, హన్మకొండ రమేశ్, బత్తుల శ్రీనివాసరావు, మూడు జ్యోతి, షేక్ గౌసుద్దీన్, డొంకెన రవి, శంకర్, నామా సేవా సమితి సభ్యుడు తాళ్లూరి హరీశ్, సరిపూడి గోపి, పాల్వంచ రమేశ్, చీకటి రాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

## అకాల వర్షం.. అతలాకుతలం..

**ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈదురుగాలులతో కూడిన వర్షం**
**పలు గ్రామాల్లో తడిసిన ధాన్యం.. రాలిన మామిడి కాయలు..**
**కొన్ని మండలాల్లో విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు..**
**గాలివాన బీభత్సానికి ఎగిరిపోయిన రేకులు, ఇళ్ల పైకప్పులు**
**అశ్వారావుపేటలో వడగండ్లు.. బూర్గంపహాడ్‌లో పిడుగు..**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివారం అకాలవర్షం కురిసింది. ఆయా వర్గాల ప్రజలను అతలాకుతలం చేసింది. ఈదురుగాలులతో కూడిన ఈ వర్షానికి పలు చోట్ల చెట్లు కూలిపోయాయి. పంటలు నేలవాలాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. కొన్నిచోట్ల ఇళ్లపై రేకులు, పైకప్పులు ఎగిరిపోయాయి. ముఖ్యంగా వైరా మండలంలో ధాన్యం తడిసిపోయింది. దానిని కాపాడుకునేందుకు రైతులు పరుగులుపెట్టారు. టార్పాలిన్లు తెచ్చి కప్పారు. దాదాపు అన్ని చోట్లా చాలాసేపటి వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉమ్మడి జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అప్పటి వరకూ భగభగమండినట్లుగా ఉన్న ఎండతీవ్రత క్రమంగా తగ్గుతూ వచ్చింది. సాయంత్రానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆ తరువాత ఈదురుగాలులతో వాన మొదలైంది. మరికొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో గాలివాన బీభత్సం సృష్టించింది. చాలా మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వైరా మండలం దాచాపురం, గన్నవరం గ్రామాల్లో రోడ్ల వెంబడి ఆరబోసిన ధాన్యం వర్షానికి తడిసి నీటిపాలైంది. దీంతో, పంట చేతికొచ్చి నెల రోజులైనా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం వల్లనే తమ ధాన్యం తడిసిపోయిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి, వడ్డె రంగాపురం, కోయరంగాపురం, నందిపాడు గ్రామాల్లో బలమైన గాలులు వీచాయి. గుమ్మడవల్లిలో తాళ్లూరి నాగేశ్వరరావు ఇంటి గోడ కూలిపోయింది. బత్తుల రాజు ఇంటి పైకప్పు రేకులు కొట్టుకుపోయాయి. కరకగూడెం, చర్ల మండలాల్లో కరెంట్ స్తంభాలు, వృక్షాలు కూలిపోయాయి. రేగుళ్ల గ్రామంలో పిడుగుపాటుకు రెండ్లు ఎద్దులు మృతిచెందాయి. అంగారుగూడెంలో సుమారు 20 ఇళ్లు కూలిపోయినట్లు సమాచారం. లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, కొత్తగూడెం మండలాల్లో మామిడితోటలో ఉన్న మామిడికాయలు రాలిపోయాయి. మిర్చి పంటలు తడిచిపోయాయి. పినపాక మండలం తోగ్గూడెంలో బూరిక చరణ్ పూరిల్లు పైకప్పు ఎగిరిపోయింది. పూలచిలక గ్రామంలో పూనెం బాలకృష్ణ అనే రైతుకు చెందిన పాడి గేదె మృతిచెందింది. ఎంపీడీవో కార్యాలయం వద్ద చెట్లు విరిగిపడడంతో నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. బూర్గంపహాడ్ మండల కేంద్రంలో తాటి చెట్టుపై పిడుగు పడింది.

– నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 21



అశ్వారావుపేట రూరల్: గుమ్మడివల్లి గ్రామంలో కురిసిన వడగండ్లు



కొత్తగూడెం టౌన్: పట్టణంలో గాలిదుమారంతో కురుస్తున్న వర్షం



పినపాక : వర్షపు నీటిలో వెళ్తున్న కారు



పినపాక: గాలివానకు ఎగిరిపడిన రేకులు



వైరా రూరల్: ఎగిరిపడిన రేకులను చూపుతున్న యజమాని



పినపాక: ఇంటి పైనుంచి ఎగిరిపడిన రేకులు



కొత్తగూడెం అర్బన్: ప్రహరీపై విరిగిపడిన చెట్టు



కరకగూడెం: తాటిగూడెంలో ఈదురుగాలికి కూలిన రేకుల షెడ్డు



కరకగూడెం మండలం అంగారుగూడెంలో ఇంటిపై నుంచి ఎగిరిపడిన రేకులు



కరకగూడెం: ప్రధాన రహదారిపై కూలిన చెట్టు



చర్ల: గ్రామంలో విద్యుత్ స్తంభంపై కూలిన కొబ్బరిచెట్టు



దుమ్ముగూడెం: నల్లబల్లి కల్లంలో ధాన్యం తడవకుండా కప్పిన టార్పాలిన్లు



కరకగూడెంలో కురుస్తున్న వర్షం



వైరా రూరల్: ధాన్యంపై కప్పిన టార్పాలిన్‌పై నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతులు



అన్నపురెడ్డిపల్లి: ధాన్యం రాశిలోని వర్షపు నీటిని ఎత్తిపోస్తున్న రైతులు



కొత్తగూడెం అర్బన్ : వాహనంపై కూలిన చెట్టు